

పోటెత్తిన రాజనాలబండ

సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండకు భక్తులు సత్యప్రమాణాల కోసం భారీగా రావడంతో కిటకిటలాడింది. - 8లో



నగరికి చేరిన చార్‌ధామ్ యాత్ర

గోమాత సంరక్షణ, లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సాధువులు ప్రారంభించిన చార్‌ధామ్ పాద యాత్ర నగరికి చేరింది. - 8లో

అలసత్వం వద్దు



ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దని డీఆర్‌ఓ పుల్లయ్య అధికారులను ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు అర్బన్: గంజాయి, సారా, అక్రమ మద్యం వంటి మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసుల శిక్షణ కేంద్రంలో శనివారం ఆయన ఎస్‌ఈబీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. విచారణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి దర్యాప్తులో వేగం పెంచాలన్నారు. నిందితులకు శిక్ష పడేలా చేయాలని ఆదేశించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసి గంజాయి, సారా తయారీ, అక్రమమద్యం రవాణాను అరికట్టాలన్నారు. మాదక ద్రవ్యాలు సేవించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. నిషేధిత మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గంజాయి, అక్రమ మద్యం, ఇసుక, సారా నిర్మూలనకు చేపట్టిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

12న పీఎఫ్ సమస్యలపై ధర్నా



సమ్మె నోటీసును అందిస్తున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: భవిష్యనిధి(పీఎఫ్) ఖాతాల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలపై ఈనెల 12న జెడ్పీ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు ఎస్టీయూ నాయకులు ప్రకటించారు. శనివారం మధ్యాహ్నం జెడ్పీ కార్యాలయంలో ఏఓ లోకేష్‌కు ధర్నా నోటీసును అందజేశారు. అత్యవసర సందర్భాల్లో ఉపయోగపడుతుందని ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతి నెలా తమ జీతాల నుంచి పీఎఫ్ చందాలను పొదుపు చేస్తున్నారని తెలిపారు. అయితే ఎవరెవరి ఖాతాల్లో ఎంతమొత్తం ఉందో తెలియకపోవడం వల్ల పీఎఫ్ స్లిప్పులు విడుదల చేయకపోవడంతో ఆందోళన నెలకొందన్నారు. జీపీఎఫ్ తరహాలో జెడ్పీ పీఎఫ్ ఎందుకు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహించబోయే మహాధర్నాకు జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్‌యాదవ్, జిల్లా నాయకులు లింగయ్య, నరేంద్ర, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

జిల్లాలో పలువురు సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లాల పని చేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో పాకాల సీఐ ఎం.రాజగోపాల్‌ను బద్వేలుకు, తిరుపతి ఎస్సీ ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న ఎ.చాన్‌బాషాను మదనపల్లె టూటౌన్‌కు, తిరుమల సీసీఎస్‌లో ఉన్న కే.రెడ్డిశేఖర్‌రెడ్డిని కలికిరికి, శ్రీసిటీలో ఉన్న చిన్న పెద్దయ్యను అన్నమయ్యకు, తిరుపతి సీసీఎస్‌లో ఉన్న పి.రామకృష్ణను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు.

తహసీల్దార్ పోస్టింగ్‌ల్లో మార్పులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని తహసీల్దార్ పోస్టింగ్‌లలో మార్పులు చేశారు. ఈ మేరకు శనివారం మార్పులు చేసిన పోస్టింగ్ ఉత్తర్వుల జాబితాను కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ జారీ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏఓగా కులశేఖర్‌ను నియమించారు. బదిలీపై జిల్లాకు వచ్చిన ఈయనకు సదుం తహసీల్దార్‌గా శుక్రవారం పోస్టింగ్ ఇచ్చారు. గత ఉత్తర్వుల్లో కలెక్టరేట్ ఏఓగా నియమించిన సీతారామ్‌ను కుప్పం ఆర్డీఓ కార్యాలయం డీఏఓగా బదిలీ చేసి కలెక్టరేట్ ఏఓగా కులశేఖర్‌ను తాజాగా నియమించారు. విజయపురం తహసీల్దార్‌గా నియమితులైన మాధవరాజును డిప్యుటేషన్‌పై బైరెడ్డిపల్లి తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. కలెక్టరేట్ ల్యాండ్ సీలింగ్ డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న పార్థసారథికి యాదమరి తహసీల్దార్‌గా, జిల్లా పౌరసరఫరాల శాఖలో డీటీ, కలెక్టర్ సీసీగా ఉన్న మారూఫ్ హుస్సేన్‌ను సదుం తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. శాంతిపురం తహసీల్దార్ అమరనాథ్‌ను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేయగా, అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న రామును చిత్తూరు జిల్లాకు కేటాయించారు. రొంపిచెర్ల డిప్యూటీ తహసీల్దార్ లోకేష్‌ను తిరుపతి జిల్లాకు, వెదురుకుప్పం రీసర్వే డీటీ జయంత్ కుమార్‌ను తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు. తంబళ్లపల్లె రీసర్వే డీటీ ఇషాక్‌ను చిత్తూరు జిల్లాకు, తిరుపతి జిల్లాలో డీటీగా పని చేస్తున్న శ్రావణ్‌కుమార్‌ను చిత్తూరు జిల్లాకు కేటాయించారు. బదిలీ పొందిన వారు వెంటనే నూతన స్థానాల్లో విధుల్లో చేరాలని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.



గతంలో వేరుశనగ పంట మధ్యలో సాగైన సాలు పంట

సాలు పంటలు సాలించారే..!



వేరుశనగలో సాగు చేసిన సాలు పంట (ఫైల్)

- వేరుశనగ చేలల్లో కనిపించని సాలు పంటలు
- భారీగా తగ్గిన చిరుధాన్యాల సాగు
- ట్రాక్టర్లతో విత్తనాలు వేస్తుండడంతో సాలు పంటలపై తగ్గిన మక్కువ
- ప్రస్తుతం మార్కెట్‌లో చిరుధాన్యాలకు డిమాండ్
- మారిన జీవనశైలి కారణంగా పౌష్టికాహారం తీసుకోవడానికి ఇష్టపడుతున్న జనం
- సాలు పంటలపై ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- సాలు పంటల సాగుకు ప్రోత్సాహం అందించాలంటున్న రైతులు

అసలు పంట ఆదుకోకున్నా కొసరు పంటలు ఆదుకుంటాయనేది పెద్దలు చెప్పే సామెత. ఒకప్పుడు ఏటా ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగతో పాటు సాలు పంటలు వేయడం ఆనవాయితీ. సాలు పంటల్లో ముఖ్యంగా కందులు, జొన్నలు, అలసంద, పెసలు, అనప తదితర పంటలు సాగు చేసేవారు. సరైన వర్షాలు లేక వేరుశనగ పంట దెబ్బతిన్నా..సాలు పంటలు రైతులను ఆదుకునేవి. ఒక పంటలో నష్టం చవిచూస్తే సాలు పంటలు ఆ నష్టాన్ని పూడ్చేలా ఉండేవి. ఇవి రైతులకు ఉభయకారిగా ఉండేవి.

పలమనేరు/చిత్తూరు అగ్రికల్చర్: గతంలో ఎద్దుల మడకతో తొలుత సాలు దున్ని అందులో రకరకాల సాలు విత్తనాలేసి ఆపై వేరుశనగ విత్తనాలేసేవారు. క్రమంగా కాడెద్దులు కరువై ట్రాక్టర్ల రాకతో మొత్తం వేరుశనగ తప్ప సాలు పంటలు వేసే వారు లేరు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జీవన ప్రమాణాలు మారాయి. ఇప్పుడు అంతా మిల్లెట్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. ఒకప్పుడు మన పెద్దలు తిన్న రాగి, కొర్రన్నం, సామలు, అలసందలు, పెసలు వంటి చిరుధాన్యాలతో చేసిన ఆహారం తీసుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో బీపీ, షుగర్ వంటి రోగాలు అందరికీ సర్వసాధారణమయ్యాయి. దీంతో చాలామంది మిల్లెట్స్‌తో చేసిన వాటినే తింటున్నారు. హోటళ్లలో కూడా ఈ మధ్య రాగి, జొన్న, సజ్జలు, కొర్రలతో చేసిన వంటకాలు లభిస్తున్నాయి.



గతంలో సాగైన సజ్జ పంట (ఫైల్)

చిరుధాన్యాలపై రైతులు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు. వీటి సాగును పెం

చిరు ధాన్యాలపై నిర్లక్ష్యం..

చేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇన్‌సింప్ అనే కార్యక్రమం ద్వారా చిరు ధాన్యాల సాగును పెంచేందుకు కృషి చేస్తోంది. మరోవైపు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా చిరుధాన్యాల సాగును చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఈ కార్యక్రమాల అమలు స్థానికంగా అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పటికైనా చిరుధాన్యాల విత్తనాలను సబ్సిడీ ద్వారా రైతులకు అందించి మండలంలో చిరు ధాన్యాల సాగు చేపట్టేందుకు స్థానిక వ్యవసాయశాఖ కృషి చేయాల్సిన అవసరం ఉంది.



గతంలో సాగైన జొన్న పంట (ఫైల్)

ఘుమఘుమలాడే వంటలు..

గతంలో రైతుల ఇళ్లల్లో చిరుధాన్యాల వంటకాలు ఘుమఘుమలాడేవి. అవి పౌష్టికాహారం గనుక నాడు రైతులు పొలంలో చెమట చిందించి పంటలు పండించే శక్తి ఉండేది. అప్పట్లో కూరలు సైతం ఎంతో రుచిగా ఉండేవి. రాగిముద్దలోకి అనపకాయలు, ఎండుకందులు, అలసంద గింజల చారు చేసుకుంటే నోట్లో నీళ్లూరేవి. ఎలాంటి పురుగు మందులు లేకుండా ఇవి పండేవి. దీంతో మనుషులు ఆరోగ్యంగా ఉండేవారు. ఇవన్నీ పెద్దలు నేటి తరాలకు నేర్పిన ఆరోగ్య సూత్రాలే. కానీ గత పది, పదిహేనేళ్లుగా సాలు పంటలను రైతులు సాలించేశారు. వాటి సాగు విస్తీర్ణం ఇప్పుడు వేల ఎకరాల నుంచి పదుల్లోకి చేరింది.

ఇప్పటికే కనుమరుగు..

చిరుధాన్యాల సాగు ఏటా తగ్గిపోతోంది. భవిష్యత్‌లో వీటి జాడ కనుమరుగవుతుందేమోనన్న ఆందోళన నెలకొంది. గతంలో పల్లెల్లో ప్రతి ఇంటా ధాన్యంతో పాటు పలు రకాల చిరు ధాన్యాలు సమృద్ధిగా ఉండేవి. అయితే ప్రస్తుతం వీటి సాగు నామమాత్రంగా మారింది. చిరుధాన్యాల్లో ముఖ్యమైన సజ్జ, సామ, కొర్ర, జొన్న, రాగి విస్తీర్ణం భారీగా తగ్గింది. సాగవుతోన్న వేరుశనగలో కేవలం 1 శాతం మాత్రమే సాలు పంటలుగా వేశారు. ఇక సజ్జ, సామ, కొర్రలు ఎలా ఉంటాయో నేటి తరానికి తెలియకపోవడం బాధాకరం. అత్యధిక పోషకాహార గుణాలు కలిగిన ఈ ధాన్యాలు సాగుకు నోచుకోవట్లేదు.

ఇదీ జిల్లాలో చిరుధాన్యాల సాగు పరిస్థితి

పంట	సాధారణ సాగు (ఎకరాల్లో)	ప్రస్తుతసాగు
జొన్న	86	0
కందులు	3261	551
మినుములు	122	30
అలసందలు	540	144
సజ్జ	566	392
రాగి	3101	78
కొర్ర	42	0
సామ	208	15
ఉలవలు	2964	145
నువ్వులు	4	1
పొద్దుతిరుగుడు	1	0
ఆముదం	20	0

సాలు పంటలే లేకుండా పోయే..!



“ ముందంతా చేళల్లో వేరుశనగతో పాటు మునాల్లో సాలు పంటలు వేస్తాంటిమి. వేరుశనగ ఒబ్బిడ య్యాక ఉలవలు వేస్తాంటిమి. డిసెంబర్‌లో పడే మంచుకే పంట పండతావుండె. అప్పుడు ఎద్దుల మడకతో గింజలేస్తాంటిమి. ఇప్పుడు ట్రాక్టర్లకే గింజలేసే పరికరాలు వచ్చాయి. దీంతో రైతులు కూడా సాలు పంటలు సాలిస్తిమి.

– సోమిరెడ్డి, నడిమిదొడ్డిపల్లి, పలమనేరు

చిరుధాన్యాల సాగుకు కృషి చేస్తున్నాం



జిల్లాలో చిరుధాన్యాల సాగు తగ్గుముఖం పడుతున్న మాట నిజమే. ఏటా చిరుధాన్యాల సాగు పెంపునకు వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఉలవ, జొన్నలను సబ్సిడీతో అందిస్తున్నాం. రైతులు కూడా చిరుధాన్యాలు పండించాలని భావించాలి. వీటిల్లో ఉండే ప్రొటీన్స్ మనకు ఎంతోమేలు చేస్తాయి. చిరుధాన్యాల పెంపుపై ప్రత్యేక చొరవ చూపుతాం. – మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి, చిత్తూరు

పాడి రైతులకు అన్యాయం చేస్తే చర్యలు

- ఒక్కో డెయిరీలో ఒక్కో రేటు ఎందుకు?
- నగరిలో నీటి కాలుష్యానికి పాల్పడితే కఠిన చర్యలు
- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్:జిల్లాలోని పాల డెయిరీల్లో ఒక్కొక్క చోట ఒక్కొక్క రేటు ఎందుకు ఇస్తున్నారని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ప్రశ్నించారు. శనివారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆయన వరుసగా సమీక్షలు నిర్వహించారు. ప్రైవేట్ పాల డెయిరీ యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాల ధర, పాల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 21 ప్రైవేట్ డెయిరీలు ఉన్నట్లు చెప్పారు. పాడి రైతులకు అన్యాయం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వెన్నశాతం ఒకే విధంగా ఉన్నప్పటికీ ధర వ్యత్యాసం ఎందుకుంటోందని ప్రశ్నించారు. వివిధ డెయిరీల ప్రతినిధులు కలెక్టర్‌తో మాట్లాడుతూ పాడి రైతులకు చెల్లించే పాలధరలో వ్యత్యాసానికి గల కారణం డిమాండ్, సప్లై అని అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో కోఆపరేటివ్ డెయిరీకి పాలు పోసే పాడి రైతులకు లీటర్‌పై రూ.5 అదనంగా ఇస్తున్నారని, ఆ విధానాన్ని ఏపీలో కూడా అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం అందిస్తున్న రూ.30 వేలు బీమా మొత్తాన్ని కూడా పెంచాలని కోరారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్, ఆ శాఖ సహాయక డీడీలు గోవిందయ్య, ఆరిఫ్, అధికారులు పాల్గొన్నారు.

నీటి కాలుష్యానికి పాల్పడితే చర్యలు

జిల్లాలోని నగరి చుట్టు పక్కల ఉన్న చేతిఅద్దకం, యాంత్రిక అద్దకం (డైయింగ్ యూనిట్స్) పరిశ్రమల నిర్వాహకులు నీటి కాలుష్యానికి పాల్పడితే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ నగరి చుట్టుపక్కల ఉన్న నింద్ర, విజయపురం మండలాల్లో నీటి కాలుష్యం జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. నగరిలో ఉన్న వ్యర్థనీటిని శుద్ధీకరణ చేసే ప్లాంటు(సీఈటీపీ) తరలించే ప్రక్రియలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. నగరిలో ఉన్న అన్ని యూనిట్ పరిశ్రమలను సమగ్ర విచారణ చేసి వివరాలను సేకరించాలని కాలుష్య నియంత్రణ మండలి, నగరి కమిషనర్‌ను ఆదేశించారు. నగరి, చింతలపట్టెడ ప్రాంతంలో ప్రభుత్వం రూ.16 వేల కోట్లు వెచ్చించి ఒక రోజుకు 40 లక్షల లీటర్ల వ్యర్థ నీటిని శుద్ధీకరణ చేసే ప్లాంటును ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుతం కేవలం 1.50 లక్షల వ్యర్థ నీటినే శుద్ధి చేయడం జరుగుతోందన్నారు. 16 యాంత్రిక పరిశ్రమలు నిర్వహిస్తుండగా అందులో 7 మాత్రమే నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారని, మిగిలిన 9 నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ అశోక్ కుమార్ వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జెడ్‌ఎం చంద్రశేఖర్, ఏజీఎం భార్గవి, నగరి కమిషనర్ మంజునాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ అంటేనే సురక్షితం



డ్రైవర్లు, మెకానిక్‌లు, కండక్టర్లకు గులాబీ పూలు అందిస్తున్న డీపీటీఓ

తిరుపతి అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అంటేనే సురక్షితమని ప్రయాణికులు భావిస్తున్నారని జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ)చెంగల్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి ఆయన అలిపిరి, మంగళం డిపోల్లో డ్రైవర్లతో పాటు కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బందికి గులాబీ పూలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 11 డిపోలు ఉన్నాయని, అందులో 911 ఆర్టీసీ సర్వీసులు రోజు 3.44 లక్షల కిలోమీటర్ల దూరం నడుస్తున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లాలో 1,450 మంది కండక్టర్లు, 1,788 డ్రైవర్లు, 538 మంది మెకానిక్స్ పని చేస్తున్నారని వెల్లడించారు. బస్సుల కండీషన్ పరిశీలించడంలో మెకానిక్‌ల పాత్ర కీలకమన్నారు. అదేవిధంగా డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. కండక్టర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని తెలిపారు. ఇటీవల సూళ్లూరుపేట డిపో సర్వీస్ గూడూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కూతురు మృతి చెందడం బాధాకరమన్నారు. ఆర్టీసీపై నమ్మకంతో బస్సులో ప్రయాణిస్తున్నారన్న విషయాన్ని సిబ్బంది గుర్తుపెట్టుకోవాలని వివరించారు. గూడూరు సంఘటనలు పునరావృతం కాకుండా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.భాస్కర్, డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, మంగళం డిపో మేనేజర్ భాస్కర్ పాల్గొన్నారు.

కోనేరులో పడి అవ్వ, మనవడు మృతి



తులసమ్మ(ఫైల్)



అద్విక్(ఫైల్)

సదుం : ప్రమాదవశాత్తు కోనేరులో పడి ఓ అవ్వ, మనవడు మృతిచెందిన సంఘటన శనివారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లెకు చెందిన తులసమ్మ (55) కుమారుడు చరణ్‌తో కలిసి తిరుపతిలో నివాసం ఉంటున్నారు. స్వగ్రామంలో ఇల్లు నిర్మిస్తుండడంతో ఐదు రోజుల క్రితం ఆమె మనవడు అద్విక్ (3)తో కొత్తపల్లెకు వచ్చింది. శనివారం గ్రామంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లారు. తిరిగి వస్తూ మార్గమధ్యలో ఉన్న విరూపాక్షమ్మ ఆలయ కోనేరు వద్దకు వెళ్లారు. కోనేరులో మనవడు ప్రమాదవశాత్తు పడిపోవడంతో అతన్ని రక్షించేందుకు ఆమె ప్రయత్నించి మునిగిపోయింది. గ్రామస్తులు గుర్తించి వెలికి తీసేలోపే ఇద్దరూ మృతిచెందారు.



ప్రమాదానికి కారణమైన కోనేరు

కరెంట్ బిల్లులు కట్టేందుకు నిధులు ఇవ్వండి



ఏపీసీకి వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : సర్కారు స్కూళ్లలో కరెంటు బిల్లులు చెల్లించాలని కాంపోజిట్ గ్రాంట్ నిధులు విడుదల చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు చెంగల్రాయ మందడి కోరారు. ఈ మేరకు సంఘ నాయకులు శనివారం సమగ్రశిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బిల్లులు చెల్లించకపోతే కరెంట్ కట్ చేస్తామని విద్యుత్‌శాఖ అధికారులు టీచర్లను బెదిరిస్తున్నారని తెలిపారు. దాదాపు ఒక సంవత్సరం ఐదు నెలలకు సంబంధించి కరెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కిరణ్‌కుమార్, చిట్టిబాబు, దినకర్ పాల్గొన్నారు.

బిందుసేద్యం పరికరాలకు దరఖాస్తులు

చిత్తూరు అగ్రికల్చర్: బిందు, తుంపర్ల సేద్యంపై ఆసక్తి ఉన్న రైతులు పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎంఐపీ డ్రిప్ పీడీ బాలసుబ్రమణ్యం తెలిపారు. బిందు, తుంపర్ల సేద్యం వల్ల తక్కువ నీటితో పంటలను సాగుచేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు భరోసా కేంద్రం(రైతు సేవాకేంద్రం)లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, ఆన్‌లైన్ వన్‌బీ, బ్యాంకు ఖాతాలతో సంప్రదించాలని కోరారు.

రెవెన్యూ రికార్డులకు పోలీసు పహారా

- నూతన తహసీల్దార్లు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి
- త్వరలో నిషేధిత భూముల జాబితా నివేదికలు పునఃపరిశీలన
- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో గుర్తించిన రెవెన్యూ కార్యాలయాల్లోని రికార్డు రూముల వద్ద పోలీసు పహారా పెట్టడం జరిగిందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా రెవెన్యూ రికార్డులు భద్రపరిచిన రూముల వద్ద పోలీసుల పహారా, అలాగే సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం త్వరలో వారానికి ఒకసారి తహసీల్దార్లు, వీఆర్‌ఓలతో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహిస్తామన్నారు. నూతన తహసీల్దార్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించి జిల్లావ్యాప్తంగా ఉన్న నిషేధిత భూముల జాబితాను పునఃపరిశీలన చేయిస్తామని వెల్లడించారు.

ఆ జాబితాను పునఃపరిశీలిస్తాం

గతంలో జిల్లావ్యాప్తంగా 1,66,000 ఎకరాలను నిషేధిత భూముల నుంచి తొలగించడం జరిగిందని, వాటిని గతంలోనే పునఃపరిశీలన చేసి కచ్చితత్వం లేని 82,000 మంది ఎకరాలను నిషేధిత భూముల జాబితాలో తిరిగి చేర్చినట్లు జేసీ వెల్లడించారు. మిగిలిన 84,000 ఎకరాల నిషేధిత భూముల జాబితాను ప్రత్యేక బృందాలతో త్వరలో విచారణ చేయిస్తామన్నారు. పరిశీలనలో అన్ని ఆధారాలు కచ్చితంగా ఉంటే సంబంధిత భూములను తొలగిస్తామని, తప్పుడు నివేదికలు ఉంటే మాత్రం వాటిని తిరిగి నమోదు చేస్తామని స్పష్టం చేశారు. నూతన తహసీల్దార్లు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

ఈహెచ్‌ఎస్ పరిధిని రూ.5 లక్షలకు పెంచాలి



మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల ఈహెచ్‌ఎస్ పరిధి రూ.5 లక్షలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ కోరారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం విజయవాడలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఉచిత వైద్య సదుపాయాలు ఈహెచ్‌ఎస్ అమలులో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు బదులు ఎంప్లాయీస్ హెల్త్‌స్కీమ్ క్యాష్‌లెస్ వైద్యం కల్పించడంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో స్పందన సరిగ్గా లేదన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను తిరిగి కొనసాగించాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల అప్‌లోడ్ కాలపరిమిత ఆరు నెలల నుంచి 11 నెలలకు పెంచాలన్నారు. సీలింగ్ అమౌంట్ పరిమితి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలని కోరారు. ఈహెచ్‌ఎస్ క్యాష్‌లెస్ వైద్యం పక్క రాష్ట్రాలైన చెన్నై, బెంగళూరు, హైదరాబాదు ప్రాంతాల్లో కూడా అనుమతించాలని తెలిపారు. 45 ఏళ్లు దాటిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏడాదికి ఒకసారి మాస్టర్ హెల్త్ చెకప్ చేయించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

పుత్తూరు: విద్యార్థులను మానసికంగా, శారీరకంగా దృఢంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఉందని డీఈఓ వి.శేఖర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం డీవైఈఓ ప్రభాకర్‌రాజు అధ్యక్షతన పుత్తూరు డివిజన్ స్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో డీఈఓ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభిరుచి మేరకు వారిని క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. అలాగే వారి ప్రవర్తన, అలవాట్లు, మానసిక పరిస్థితిని క్షుణంగా అధ్యయనం చేసి మంచి మార్గంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలు బాబు, సురేష్, 16 మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

పుత్తూరు డివిజన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.భక్తగోపాల్(శ్రీకాళహస్తి), మహిళా అధ్యక్షురాలుగా అమ్ములు(పిచ్చాటూరు), కార్యదర్శిగా ఎ.గోపికృష్ణ (గొల్లపల్లి), కోశాధికారిగా ఎస్.ఎం.లోకనాథం(బీరకుప్పం) ఎన్నికయ్యారు.

క్లుప్తంగా

వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కార్వేటినగరం: మండలంలోని ముక్కరవాని పల్లె గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద నాటు తుపాకీ కలిగిన ఓ వ్యక్తిని కార్వేటినగరం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని ముక్కరవానిపల్లె కార్డెన్ సెర్చ్ నిర్వహణ నిమిత్తం వెళ్తుండగా వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ షికారి కాలనీకి చెందిన అర్జున్(32) నాటు తుపాకీతో ఉండగా పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

కుప్పం: పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. తిరుపతి జిల్లా భాకరాపేటకు చెందిన ఉదయ్‌కుమార్ కొంతకాలంగా పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. వజ్రవేల్ శెట్టి వీధిలో నివసిస్తున్నారు. అయితే ఉదయ్ కుమార్ శుక్రవారం రాత్రి ఉరి వేసుకుని ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కుప్పం వంద పడకల ఆస్పత్రికి తరలించి కుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించకూడదని డీఆర్‌ఓ పుల్లయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదైన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారానికి ప్రతి శాఖలో ఒక ప్రత్యేక బృందం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సంబంధిత బృందం నమోదైన అర్జీలను త్వరిత గతిన పరిశీలించి పరిష్కారం చేయాలన్నారు. విధాన పరమైన నిర్ణయాలు ఉన్నట్‌లెతై ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, డీఆర్‌డీఏ పీడీ తులసి, హౌసింగ్ పీడీ పద్మనాభం, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


దేవుడి మాన్యంలో అక్రమ కట్టడాలు



నాయునివారిపాళ్యం వద్ద దేవుడి మాన్యంలో చేపట్టిన నిర్మాణ పనులు

చౌడేపల్లె: మండలకేంద్రంలోని నాయునివారి పాళ్యం సమీపంలో గల కోట్లాది రూపాయలు విలువచేసే దేవుడి మాన్యం భూములను ఆక్రమించుకుని కొందరు దర్జాగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. సర్వే నంబరు 147/1లో సుమారు 3.28 ఎకరాల శ్రీ కదిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి చెందిన మాన్యం భూమి ఉంది. ఈ భూములను కొందరు రాజకీయ అండతో దర్జాగా ఆక్రమించుకుని ఇంటి నిర్మాణాలు చేపడుతుండగా, మరికొందరు ఈ భూములను కొనుగోలు చేసి ఇతరులకు అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. ఈ ఆక్రమణల తంతు రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. మాన్యం భూముల్లో అక్రమణ కట్టడాలను అడ్డుకుని దేవుడి మాన్యం ఆస్తులను జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని రక్షించాలని కోరుతున్నారు.

ఇసుక డంప్‌లను సీజ్ చేయండి



ముసలిమొడుగు వద్ద టీడీపీ నేతలు డంప్ చేసిన ఇసుక

పలమనేరు: మండలంలోని ముసలిమొడుగు వద్ద టీడీపీ నాయకులు అక్రమంగా డంప్ చేసి రెండువేల లోడ్ల ఇసుకను అధికారులు సీజ్ చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు బాలాజీనాయుడు, రాజారెడ్డి, చెంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వారు తహసీల్దార్ ఇన్బనాథన్‌కు ముసలిమొడుగు గ్రామం వద్ద టీడీపీ నేతల ఇసుక డంప్ ఫొటోలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అంటూనే, మరోవైపు ఆ పార్టీ నేతలు వేలాది లోడ్ల ఇసుకను జేసీబీలతో తోడి వారి పొలాల వద్ద డంప్ చేసుకుంటున్నారని తెలిపారు. దీనిపై తాము ఇప్పటికే అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. నాలుగురోడ్ల వద్ద ప్రభుత్వ రీచ్‌లో ఇసుక ఖాళీ అయినందున ఇక్కడ దాచిన ఇసుకను సీజ్‌చేయాలని విన్నవించారు. అపై స్థానిక సెబ్, మైనింగ్ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు.

భక్తులతో పోటెత్తిన రాజనాలబండ



ప్రమాణం చేయడానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న అర్చకుడు

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం సత్యప్రమాణం కోసం వచ్చిన ప్రజలతో కిటకిటలాడింది. సదుం మండలం బట్టువారిపల్లె, పెద్దపంజాణి మండలం బసవరాజు కండ్రిగ, ముళబాగిల్, మదనపల్లె, కోలార్, బెంగళూరు ప్రాంతాల నుంచి వివిధ సమస్యలు, చోరీ విషయాలపై ప్రమాణం చేయడానికి వచ్చా రు. అర్చకులు కృష్ణమూర్తి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ ఆధ్వర్యంలో రావిచెట్టు రచ్చబండపై పంచాయతీ నిర్వహించారు. కొందరికి వచ్చే వారం వరకు గడువు ఇవ్వగా మరి కొందరికి రెండువారాలు గడువు ఇచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నగరికి చేరిన చార్‌ధామ్ యాత్ర



ఆలయం వద్ద సాధువుల ఆశీస్సుల కోసం వచ్చిన జనం

నగరి : ప్రజా సంక్షేమం, గోమాత సంరక్షణ, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ రాజస్థాన్ లిక్‌మడేశ్వర్ యశ్నాజీ మహరాజ్ మట్ నుంచి సోమనాథ్‌జీ మహరాజ్, కన్నత్‌జీ మహరాజ్ అనే సాధువులు ప్రారంభించిన చార్‌ధామ్ పాదయాత్ర శుక్రవారం అర్ధరాత్రి నగరికి చేరుకుంది. మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో వారు బస చేశారు. ఆలయ నిర్వాహకులు వారికి బస ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం చంద్రమౌళీశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం చార్‌ధమ్ అని పిలవబడే నాలుగు సుప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రాలైన బద్రీనాథ్, ద్వారక, పూరీ, రామేశ్వరంను, 12 జ్యోతిర్లింగాలను, సప్త నదులను, సప్తపురిని, పంచసరోవరాలను పాదయాత్రగా వెళ్లి దర్శించుకునేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీన యాత్ర ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు రెండు ధామ్‌లు, నాలుగు జ్యోతిర్లింగాలు, నాలుగు పురులు దర్శించుకోవడం జరిగిందన్నారు. 4 వేల కిలోమీటర్ల మేర ప్రయాణం సాగిందన్నారు. 104వ రోజున నగరికి చేరుకున్నామని చెప్పారు. ప్రస్తుతం నగరి నుంచి 5వ పురి అయిన కాంచీపురానికి వెళ్తున్నట్లు చెప్పారు.

లారీ-బైక్ ఢీకొని..

వి.కోట: ఎదురెదురుగా వస్తున్న లారీ, బైక్ ఢీకొన డంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన వి.కోట–కుప్పం జాతీయ రహదారిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఎలక్ట్రీషియన్ సదానీ(32) శనివారం వి.కోటలో పనులు ముగించుకుని బైక్‌లో కుప్పం వైపు వెళ్తుండగా.. ఈరోడ్ నుంచి తిరుపతికి ప్లాస్టిక్ డోర్ల లోడుతో వెళ్తున్న లారీని పడిగలకుప్పం గ్రామం వద్ద ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ లింగప్ప అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రెహాన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మృతి చెందిన సదాని



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో వలంటీర్ మృతి



మురుగేష్ (ఫైల్)

కుప్పం: కుప్పం మున్సిపాలిటీ పరిధిలో గత ప్రభుత్వం హయాంలో వలంటీరుగా పనిచేసిన మురుగేష్ (30) బెంగళూరులో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శాంతిపురం మండలం శివరామాపురానికి చెందిన మురుగేష్ కుప్పంలో నివాసం ఉంటూ దుకాణాలకు వాటర్ ప్యాకెట్లు సరఫరా చేస్తూ జీవనం సాగించేవాడు. గత ప్రభుత్వ హయాంలో వలంటీరుగా పని చేసి అందరికీ సుపరిచితుడయ్యాడు. ప్రస్తుత ప్రభుత్వం వలంటీర్లను తొలగించడం, దీనికి తోడు వాటర్ ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా పనులు నిలిపేయడంతో మురుగేష్ రెండు నెలలుగా కూలీ పనుల కోసం గతవారం కిందట పనుల కోసం బెంగళూరుకు భార్యాబిడ్డలతో వెళ్లాడు. శుక్రవారం అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మురుగేష్ మృతి చెందాడు. మృత్యుడికి భార్య పవిత్ర, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కుమార్తె హత్య కేసులో తండ్రి అరెస్ట్

రొంపిచెర్ల: కుమార్తె హత్య కేసులో తండ్రిని అరెస్టు చేసినట్లు కల్లూరు సీఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలు.. పెద్దమల్లెల గ్రామ పంచాయతీలోని రడింపల్లెకు చెందిన కె.మునిరత్నం (35) భార్య రెడ్డెమ్మ 10 ఏళ్ల కిందట చనిపోయింది. అప్పటి నుంచి అవ్వ, తండ్రితో కలసి కుమార్తె గౌతమి(14) ఉంటోంది. విద్యార్థిని పెద్దమల్లెల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అయితే మునిరత్నం తల్లి ఐదు నెలల కిందట మృతి చెందడంతో అప్పటి నుంచి తండ్రీ, కూతురు జీవిస్తున్నారు. అయితే రెండవ వివాహానికి కుమార్తె అడ్డుగా ఉందని మునిరత్నం గత ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంట్లో పడుకుని ఉన్న గౌతమిని సెల్ చార్జింగ్ వైర్‌తో మెడకు బిగించి చంపేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉరి వేసుకుని మృతి చెందినట్లు అందరినీ నమ్మించాడు. అయితే పోలీసులు తమ స్టైల్‌లో విచారణ చేయడంతో నిజం బయటపడింది. నిందితుడు పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉండగా శుక్రవారం ఉదయం 10 గంటలకు అరెస్టు చేసి పీలేరు కోర్టులో హాజరు పరచగా జడ్జి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

డీఈఓ దురుసు ధోరణి సరికాదు



డీఈఓ వైఖరిని నిరసిస్తూ ధర్నా చేస్తున్న ఎస్టీయూ సంఘ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్లు, సంఘ ప్రతినిధులు వివిధ సమస్యల పరిష్కారం కోసం డీఈఓ కార్యాలయానికి వచ్చినప్పుడు జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు వ్యవహరించే తీరు సరిగా లేదని, తన అనుచిత వైఖరి మార్చుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గంటామోహన్ హెచ్చరించారు. డీఈఓ వైఖరికి నిరసనగా ఆ సంఘ నాయకులు శనివారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీచర్లు వివిధ సమస్యలను చెప్పుకునేందుకు డీఈఓ వద్దకు వెళ్తే దురుసు ధోరణితో వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్ రెడ్డి, బి.మోహన్ యాదవ్ మాట్లాడుతూ టీచర్ల పట్ల డీఈఓ వైఖరి సరికాదన్నారు. ప్రజా ప్రతినిధుల పర్యటనల్లో పాఠశాలల సమస్యలను ప్రస్తావించడాన్ని కూడా తీవ్రంగా తప్పుపడుతూ, పరోక్షంగా ప్రజాప్రతినిధులను అవమానిస్తున్నారని చెప్పారు. తీవ్రమైన అనారోగ్య కారణాలు, కుటుంబ సమస్యల కారణంగా తమ ఉద్యోగోన్నతి రద్దు చేసి కింది కేడర్‌లో పోస్టింగ్ ఇవ్వాలని పలువురు టీచర్లు డీఈఓకు మొర పెట్టుకున్నారన్నారు. ఏడాదిన్నరగా డీఈఓ కార్యాలయం చుట్టూ పదిమంది టీచర్లు తిరుగుతున్నా, ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఈఓ కార్యాలయంలో ఫైళ్ల క్లియరెన్స్‌లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా డీఈఓ తీరు మార్చుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ధర్నాలో సంఘ నాయకులు హేమచంద్రారెడ్డి, శ్రీదేవి, పురుషోత్తం, దేవరాజు రెడ్డి, జిల్లా నాయకులు చంద్రన్, కిషోర్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో బొద్దింక ప్రత్యక్షం

చంద్రగిరి: ఇటీవల తిరుపతి ఆధ్యాత్మిక నగరంలోని పీఎస్–4 హోటల్లో వినియోగదారుడు తింటున్న అన్నంలో జెర్రి ప్రత్యక్షమైన ఘటన మరువక ముందే, చంద్రగిరిలోని ఓ హోటల్‌లో భోజనంలో బొద్దింక ప్రత్యక్షం కావడం కలకలం రేపింది. చంద్రగిరి కొత్తపేటలోని అంకాళమ్మ ఆలయ సమీపంలో పవిత్ర హోటల్‌లో స్థానికులు శనివారం మధ్యాహ్నం భోజనం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అన్నంతో పాటు మజ్జిగ కలిపి తినే సమయంలో భోజనంలో బొద్దింక ప్రత్యక్షం కావడంతో అవాక్కయ్యారు. వెంటనే వారు ఇదేంటని హోటల్ నిర్వాహకులను ప్రశ్నించారు. ఇష్టముంటే తినండి..లేకుంటే వెళ్లండంటూ హోటల్ నిర్వాహకులు వారిపై ఎదురుదాడికి దిగారు. దీంతో ఆగ్రహానికి గురైన వ్యక్తి భోజనంలో బొద్దింకను వడ్డించారంటూ ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. స్థానికంగా మంచి పేరున్న పవిత్ర హోటల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై చంద్రగిరి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుసుమను వివరణ కోరగా, ఇటువంటి ఘటనలతో తమకు సంబంధం లేదని, తిరుపతి ఫుడ్ సేఫ్టీ అధికారుల పరిధిలోకి వస్తుందని సమాధానం చెప్పారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

గంగాధర నెల్లూరు: కర్ణాటక మద్యం అక్రమంగా అమ్ముతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు జీడీ నెల్లూరు సీఐ లక్ష్మన్న తెలిపారు. వివరాలు.. మండలంలోని కడపగుంట హరిజనవాడ గ్రామంలో సుబ్రహ్మణ్యం తన ఇంటి వద్ద కర్ణాటక మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సీఐ లక్ష్మన్న ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీ చేశారు. సుబ్రహ్మణ్యం వద్ద కర్ణాటక టెట్రా ప్యాకెట్లు ఉండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు శిక్షణ



గుడిపాల: రైతులకు సూచనలు ఇస్తున్న లక్ష్మీప్రసన్న

గుడిపాల: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు పద్ధతులు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న అన్నారు. శనివారం పాపసముద్రం రైతుసేవా కేంద్రంలో రైతులకు సాగు పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు మోతాదుకు మించి వాడకూడదన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాల మేరకు పంటలు వేసుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువులనే వాడాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మాధవి, సర్పంచ్ చిట్టిబాబు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.